యథేచ్ఛగా కాల్వ భూముల కబ్జా

- ఆక్రమించి చదును చేస్తున్న రైతులు
- హద్దురాళ్లను తొలగించిన వైనం
- పట్టించుకోని అధికారులు


నేరడగం గ్రామ సమీపంలో కనుమరుగైన దారి

మాగనూర్: మండలంలో ప్రతి చెరువుకు కృష్ణ జలాలను అందించాలనే లక్ష్యంతో సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను మాగనూర్‌లోని నేరడగం గ్రామం నుంచి కృష్ణ మండల కేంద్రం వరకు హైలెవల్ కాలువ నిర్మించారు. ఇందులో హైలెవల్ 40 కిలోమీటర్లు, 24.40 కిలోమీటర్ల ఆర్ఎంసీగా ఉండగా అదే విధంగా లోలెవల్ 20.6 కిలోమీటర్లు, 19.6 కిలోమీటర్ల ఆర్ఎంసీగా ఉంది. నేరడగం గ్రామం నుంచి పెగడబండ గ్రామం వరకు కుడి లోలెవల్ కాలువ నిర్మించారు. అయితే ఈ కాల్వలకు ఇరువైపులా ఉన్న రోడ్ల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. గతంలో కాల్వల నిర్మాణం కోసం అధికారులు రైతుల నుంచి భూములు సేకరించి పరిహారం చెల్లించారు. అనంతరం కాల్వలను నిర్మించగా ఇరువైపులా రోడ్డు కోసం విడిచిపెట్టిన భూములపై సమీప రైతుల కన్ను పడింది. దీంతో సదరు భూములను చదును చేసి ఆక్రమించుకునే పనిలో పడ్డారు. కొందరైతే ఇప్పటికే ఆ భూములను ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు.

పలుచోట్ల కల్లాల ఏర్పాటు..

ఇప్పటికే మాగనూర్ మండలంలోని నేరడగం, తళంకేరి, కొత్తపల్లి, మాగనూర్, పెగడబండ .. తదితర గ్రామాల్లో భూములను ఆక్రమించి సాగు చేస్తుండగా వారిని చూసి మిగతా రైతులు సైతం అదే బాట పట్టారు. కాలువ భూముల్లో పలుచోట్ల రైతులు సాగు పనులు చేస్తుండగా మరికొన్ని చోట్ల పంటను ఆరబెట్టుకునే కల్లాలను ఏర్పాటు చేసుకున్నారు. కాలువల నిర్మాణ సమయంలో హద్దులుగా ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద బండరాళ్లను సైతం తొలగించి ఆక్రమించిన పరిస్థితులు ఉన్నాయి. చాలా చోట్ల హద్దుల కోసం ఏర్పాటు చేసిన మొరం కుప్పలను విక్రయించి సదరు భూములను ఖాళీ చేయిస్తున్నారు.


మొర్రం తరలించి వరి సాగు చేసిన రైతు

కొనసాగుతున్న ఆక్రమణలు..

గత కొన్నేళ్లుగా కాల్వ భూముల ఆక్రమణల పర్వం కొనసాగుతున్నా.. ఒక్కరూ స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. గతంలో ఆయా గ్రామాలకు చెందిన పలువురు ఆక్రమణల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన దాఖలాలున్నాయి. కానీ ప్రస్తుతం దీనిపై ఒక్కరు కూడా స్పందించడం లేదని రైతులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కాలువ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించారు. ఆ సమయంలో మిగిలిన గుంట, రెండు గుంటల భూమిని కూడా తీసుకొని పరిహారం చెల్లించాలన్న రైతుల విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించింది. ప్రస్తుతం మిగిలిన భూములతో పాటు కాలువకు ఇరువైపులా రోడ్డు కోసం విడిచిపెట్టిన భూములను తిరిగి ఆక్రమించుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టకుంటే కాలువలకు ఇరువైపులా ఉన్న భూములు ఆక్రమించుకోవడం ఖాయమంటున్నారు.

కేసులు నమోదు చేస్తాం..



హైలెవల్, లోలెవల్ కాల్వ పక్కన 30 ఫీట్ల మేర రోడ్డు ఉంటుంది. కాలువల పరిశీలనకు వచ్చిన ప్రతిసారి రైతులకు నిబంధనలు పాటించాలని చెబుతున్నాం. అయినప్పటికీ కొందరు రైతులు రోడ్డు భూములను చదును చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. ముఖ్యంగా కాలువ మరమ్మతుకు, పరిశీలనకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ విషయంపై తహసీల్దార్‌కు సమాచారం అందించాం. వెంటనే భూములను పరిశీలించి కాలువ భూములను ఆక్రమించిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తాం.

–భానుచందర్
ఏఈ, ఇరిగేషన్ శాఖ

క్లుప్తంగా

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

మరికల్: జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి అధికార మదంతో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌పై చేసిన అనుచిత వ్యాఖలను ఖండిస్తున్నామని ఉమ్మడి జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి గాదం మల్లేష్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. బీసీ ఓట్లతో గెలిచిన ఆయన మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి పేదల అభ్యున్నతి కోసం పాటు పడిన ఎర్రశేఖర్‌ను ఉద్దేశించి విమర్శలు చేయడం సరికాదన్నారు. వెంటనే తమ నాయకుడికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే ముదిరాజ్ సంఘం తరపున నిలదీస్తామన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దూరం



కోస్గి రూరల్: ఆరోగ్యంగా జీవించడానికి వ్యక్తిగత శుభ్రత తప్పనిసరని హరిత దళ సమన్వయ కర్త వార్ల మల్లేషం అన్నారు. బుధవారం మండల పరిధిలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో ఎర్త్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత సబ్బుతో చేతులు తప్పక కడుక్కోవాలని సూచించారు. లేకపోతే సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించి వ్యాధులను వ్యాపింపజేస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్కావెంజర్ల జీతాలు చెల్లించాలి

మరికల్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే స్కావెంజర్ల జీతాలను వెంటనే చెల్లించాలని టీఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బాలరాజ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జూన్ నుంచి ఇప్పటి వరకు వేతనం చెల్లించకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 5 నెలల నుంచి వేతనాలు చెల్లించకపోతే కార్మికులు ఎలా బతకాలని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న 5 నెలల జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జియో యూజర్ల గగ్గోలు

నర్వ: మండల కేంద్రంలో జియో సిగ్నల్స్ సరిగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు యూజర్లు వాపోతున్నారు. మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టవర్‌కు జియోను అనుసంధానం చేయడంతో సమస్యలు తలెత్తి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల వందల రూపాయలు వెచ్చించి ఇంటర్‌నెట్, కాల్స్ కోసం రీఛార్జ్ చేయించుకున్నప్పటికీ సిగ్నల్స్ లేకపోవడంతో డబ్బులు వృథా అవుతున్నాయన్నారు. దీనిపై జియో అధికారిక సిబ్బంది స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకపోతే మరో నెట్‌వర్క్‌కు మారుతామని హెచ్చరిస్తున్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన



మద్దూరు: మండలంలోని దోరేపల్లి ఉన్నత పాఠశాలలోని 10 వ తరగతి విద్యార్థులకు వైఆర్‌జీ కేర్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై బుధవారం సంస్థ డీఆర్‌పీ శ్రీకాంత్‌రెడ్డి అవగాహన కల్పించారు. హెచ్ఐవీ ఏలా వస్తుంది.. రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. హెచ్ఐవీ స్థితి ఏలా తెలుసుకోవాలనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ సోకిన వారికి ఏఆర్‌టీ ద్వారా మందులు అందించడం జరుగుతుందన్నారు. హెచ్ఐవీకి సంబంధించిన మరింత సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1097ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ జోనల్ సూపర్‌వైజర్ కృష్ణ, పాఠశాల హెచ్ఎం బీమ్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

రూప్‌చంద్ చేప లభ్యం



మక్తల్: మండలంలోని సంగంబండ రిజర్వాయర్ నుంచి వచ్చిన గ్రావిటీ కెనాల్‌లో మామిళ్ల బాలస్వామికి బుధవారం రూప్‌చంద్ చేప చిక్కింది. రెడ్ ప్యాకు పిరానా జాతికి చెందిన ఈ చేప మంచినీటి చేప అని, ఒకే ఎముక కలిగి ఉంటుందని అలాగే మనిషి దంతాలను పోలినంటువంటి పళ్లు కలిగి ఉండడం ఈ చేప ప్రత్యేకత అని మత్స్యకారులు తెలిపారు. బుధవారం వలకు ఈ చేప చిక్కడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


బాధితులకు చెక్కులు అందజేస్తున్న చెన్నయ్య సాగర్

నర్వ: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ అన్నారు. నర్వలో 14 మంది బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. మొత్తం రూ2.45 లక్షల విలువైన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం ఆర్థిక సాయమందించాలని సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం ఈ నగదు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ డి.కృష్ణారెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, సద్దలి ఆంజనేయరెడ్డి, కుర్వ మహేష్, వెంకట్రామారెడ్డి, గడ్డం నర్సిములు, పరుశురాంరెడ్డి, అయ్యలప్ప యాదవ్, తదితరులున్నారు.

మహిళా కూలీలపై గ్రామస్తుల దాడి

ఊట్కూరు: మహిళా కూలీలపై గ్రామస్తులు దాడి చేసిన ఘటన బుధవారం మల్లెపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మక్తల్ మండలంలోని సోమేశ్వరబండ గ్రామానికి చెందిన పలువురు మహిళా కూలీలు పనుల నిమిత్తం ఎడివెల్లి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో మల్లెపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామంలో పత్తి తీయడానికి రావాలని కోరగా వారు నిరాకరించారు. మల్లెపల్లిలో రోజుకు రూ.300 కూలీ మాత్రమే ఇస్తారని, ఎడివెల్లిలో రూ.350 ఇస్తుండడంతో అక్కడికే వెళ్తామని చెప్పడంతో గ్రామస్తులు, కూలీల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కొంతమంది గ్రామస్తులు మహిళలనీ చూడకుండా దాడి చేసి, బూతులు తిట్టారు. దీంతో బాధిత మహిళలు ఉట్కూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ రమేశ్ వివరణ కోరగా కేసు నమోదు చేయలేదని, దాడి ఘటనపై విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



ధన్వాడ: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ధన్వాడ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం పోషణ మాసంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అలాగే 7వ నెల చిన్నారులకు అన్నప్రాసణ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ జయ మాట్లాడుతూ చిన్నారుల్లో పోషకాహారం లోపం తగ్గించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరోజ, చంద్రకళ, రాజేశ్వరి, పార్వతి, అంజలి, గీత అరుణ, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మరికల్: రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయలయ్యాయి. ఆత్మకూర్‌కు చెందిన బోయ వెంకటేష్ బుధవారం నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా వెంకటేష్ కాలు విరిగింది. క్షతగాత్రుడిని వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

క్రేన్, బైకు ఢీకొని వ్యక్తికి గాయాలు

మక్తల్: ద్విచక్రవాహనం, క్రేన్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. దాసర్‌దొడికి చెందిన బాల్‌రాజ్ (37) ద్విచక్రవాహనంపై మక్తల్‌కు వస్తుండగా ఎదురుగా వస్తున్న క్రేన్ ఢీకొట్టింది. ప్రమాదంలో బాల్‌రాజ్‌కు కాలు విరగగా జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పేటలో యూత్ కాంగ్రెస్ నాయకుల నిరసన

నారాయణపేట: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆనంద్ అజిని కుటుంబానికి న్యాయం చేయాలంటూ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోట్ల మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ నాయకుల చేతుల్లో ఆనంద్ అజినిని లైంగిక వేధింపులకు గురై చివరకు జీవితాన్ని కోల్పోవాల్సి వచ్చిందని ఈ ఘటనతో ఆర్ఎస్ఎస్, బీజేపీల నిజమైన బుద్ధి బయట పడిందని ఆరోపించారు. టీపీసీసీ జనరల్ సెక్రెటరీ, స్థానిక ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఆదేశాల మేరకు ఆర్ఎస్ఎస్, బీజేపీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. ఆనంద్‌కి న్యాయం జరిగే వరకు యూత్ కాంగ్రెస్ పోరాటం ఉధృతం చేస్తుందన్నారు. నిరసనలో టౌన్ ప్రెసిడెంట్ యూసుఫ్ తాజ్, అసెంబ్లీ ప్రెసిడెంట్ హరీశ్వర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ బస్సులు ఏర్పాటు చేయాలి

నారాయణపేట రూరల్: ప్రధాని మోదీ పర్యటనకు రాష్ట్రం నుంచి బస్సులను తరలించడంపై పీడీఎస్యూ జిల్లా సహ కార్యదర్శి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ అధికారులను నిలదీశారు. ఈ మేరకు బుధవారం వారు మాట్లాడుతూ.. ఏపీలోని కర్నూలు జిల్లాకు ప్రధాని మోదీ వస్తుండడంతో స్థానిక డిపో నుంచి భారీ ఎత్తున ఆర్టీసీ బస్సులు తరలించడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు పెట్టి పాస్ తీసుకున్నా విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో విద్యాసంస్థలకు రావడం ఇబ్బందికరమని, ప్రత్యామ్నాయ బస్సులు ఏర్పాటు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ఆర్టీసీ సీఐ అలివేలమ్మకు వినతిపత్రం అందించారు.



చెరువును కాపాడాలని వినతి



మాగనూర్: మండల కేంద్రంలోని సమన చెరువును కబ్జాదారుల నుంచి కాపాడాలని మండల రైతు సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో గల సమన చెరువు 22 ఎకరాలలో విస్తరించి ఉందన్నారు. అయితే చెరువుకు ఆనుకొని భూములు ఉన్న కొందరు రైతులు చెరువును చాలా వరకు కబ్జా చేశారని, దీంతో చెరువు కింద ఉన్న భూములకు సాగునీరు అందడం లేదన్నారు. సర్వే చేయించి కబ్జాకు గురైన చెరువును స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నరేష్, గోవింద్, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక



మక్తల్: ఊట్కూర్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని దీపిక జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు. ఈ మేరకు విద్యార్థినిని బుధవారం సన్మానించి అభినందించారు. ఇటీవల జరిగిన పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాలో 4వ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. నవంబర్ 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు యూపీలోని ఘజియాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ జట్టు తరపున పాల్గొంటుందని తెలిపారు. అలాగే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ క్రీడల్లో పాల్గొన్న కల్యాణి, దీపిక, హేమలత, రాణి, నవనీత, లక్ష్మీప్రియ, నీరజకు సర్టిఫికెట్లు అందజేశారు.

ధన్వాడ వాసుల హరినామ సంకీర్తనలు



ధన్వాడ: తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో అఖండ హరినామ సంకీర్తనలో ధన్వాడ వాసులు పాల్గొని భజన కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన మల్లికార్జున స్వామి దేవస్థానం భజన బృందం బుధవారం సంకీర్తనలు ఆలపించారు. భజన మండలి అధ్యక్షుడు పటేల్ నర్సింములు మాట్లాడుతూ పదేళ్లుగా తిరుమల తిరుపతిలో అఖండ హరినామ సంకీర్తనలు భజన కార్యక్రమలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్‌రావు, వరస్వామి, అనిల్, వెంకటయ్య, గణేష్, అరున్, సుభాస్, అరుణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించండి


అడిషనల్ కలెక్టర్‌కు విన్నవిస్తున్న నాయకులు

నారాయణపేట: దామరగిద్ద మండలం మల్రెడ్డిపల్లి, లోకుర్తి, లింగారెడ్డిపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని మూడు సార్లు డిపో మేనేజర్‌కి విన్నవించినా పట్టించుకోవడం లేదంటూ జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనుకు భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. డిపో మేనేజర్ దగ్గరికి వెళితే రోడ్డు సౌకర్యం సరిగా లేని కారణంగా బస్సు నడపడం లేదని డిపో మేనేజర్ చెప్పినట్లు అధికారికి వివరించారు. ప్రతి నెల బస్సు పాస్ ఛార్జీలు చెల్లిస్తున్నా తమ గ్రామాలకు బస్సు రావడం లేదన్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రతి రోజు కాలినడకన లేదా ప్రైవేట్ వాహనాల్లో పాఠశాలలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. తక్షణమే డిపో మేనేజర్‌పై చర్య తీసుకొని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నారాయణపేట డిపో ముందు భారీ ధర్నా చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం నాయకులు పవన్ కుమార్, భాను ప్రసాద్, భీమేష్ ఉన్నారు.

జిల్లాస్థాయి జానపద నృత్య పోటీలు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రభుత్వ, జెడ్పీ, కేజీబీవీ, మోడల్ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు 11 విభిన్న థీమ్‌లలో ప్రజా సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శించారు. పోటీల్లో దామరగిద్ద జెడ్పీ స్కూల్ విద్యార్థులు మొదటి బహుమతి సాధించగా నర్వ కేజీబీవీ పాఠశాల రెండో స్థానంలో నారాయణపేట ప్రభుత్వ అభ్యాసన ఉన్నత పాఠశాల తృతీయ స్థానంలో నిలిచింది. ప్రథమ బహుమతి గెలుచుకున్న బృందం రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లనుంది. కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్, పీఈటీలు కథలప్ప, పర్వీన్‌బేగం పాల్గొన్నారు.

వలసల నివారణపై ప్రత్యేక దృష్టి


నాచారంలో అవగాహన కల్పిస్తున్న బాలకృష్ణ

కోస్గి: ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే వారిని నివారించి స్వయం ఉపాధిని కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఇంటర్నేషనల్ ఆర్గనైజింగ్ ఫర్ మైగ్రెంట్స్ సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ బాలకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాచారం, కొత్తపల్లి గ్రామాలలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. మండలంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద చంద్రవంచ, ముశ్రీఫా గ్రామాలు ఎంపిక య్యాయని తెలిపారు. ఇందులో భాగంగా వలస కుటుంబాల్లో మానసిక స్థైర్యాన్ని నింపడం, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు స్వయం ఉపాధి, శిక్షణ పొందిన వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పవన్, ఫీల్డ్ ఫెసిలిటర్ ప్రసాద్, హన్మంతు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి


మధ్యలోనే నిలిచిన ప్రహరీ నిర్మాణం

మాగనూర్: మండల పరిధిలోని అమ్మపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీని త్వరితగతిన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాల చుట్టూ గోడ లేకపోవడంతో విద్యార్థుల అవస్థలను దృష్టిలో ఉంచుకొని అధికారులు రూ.2.50లక్షలు మంజూరు చేయగా నిర్మాణం చేపట్టారు. అయితే ఇటీవల పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ఏమైందో ఏమో పనులను మధ్యలోనే ఆపేశాడు. పాఠశాల ప్రాంగణంలోనే ఇనుపరాడ్లు, రాళ్లు ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి ప్రహరీతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విదేశీ వస్తువులను బహిష్కరిద్దాం

నారాయణపేట రూరల్: విదేశీ వస్తువులను బహిష్కరించి దేశ ఔన్నత్యాన్ని కాపాడాలని ఆర్ఎస్ఎస్ నగర సంఘ్ చాలక్ డాక్టర్ మదన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని, తద్వారా దేశానికి లాభం జరుగుతుందన్నారు. విద్యార్థులు స్వదేశీ వస్తువుల ప్రాముఖ్యతను గ్రామ గ్రామాలకు వెళ్లి చాటి చెప్పాలని కోరారు. అనంతరం సత్యనారాయణ చౌరస్తాలో విదేశీ భూతం పేరిట ఏర్పాటు చేసిన దిష్టిబొమ్మను దహనం చేశారు. డాక్టర్ సచిన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ ధ్రువపత్రాలు ఇవ్వొద్దు

ఊట్కూరు: మాదాసి కుర్వలకు ఎస్సీ కులపత్రాలను ఇవ్వొద్దని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ చింతరవికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు హన్మంతు మాట్లాడుతూ మాదాసి కుర్వలు తమ ప్రాంతంలో ఎక్కడ లేరని అధికారులపై రాజకీయ ఒత్తిడి తెచ్చి సర్టిఫికెట్‌లు పొంది లాభాపడుతున్నారన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు సైతం వినతిపత్రాలు అందిస్తామని తెలిపారు. బాలప్ప, నర్సింహులు, అంజప్ప, బాలప్ప పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి



నారాయణపేట/నారాయణపేట రూరల్: గూడ్స్ వాహనాలను ప్రజా రవాణాకు వినియోగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రాముడు హెచ్చరించారు. జిల్లా కేంద్రం అలాగే మండల పరిధిలోని అప్పక్ పల్లి రోడ్డుపై బుధవారం వేర్వేరుగా వాహన తనిఖీలు చేపట్టగా గూడ్స్ వాహనాలలో పరిమితికి మించి కూలీలను తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. గూడ్స్ వాహనాలు కేవలం సరుకుల రవాణా కోసమే ఉపయోగించాలని ప్రజా రవాణాకు వినియోగించడం నేరమన్నారు.

బైక్ సీజ్

బైక్‌ను ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసి బైక్‌ను సీజ్ చేసినట్లు పట్టణ ఎస్ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సైలెన్సర్‌ను మార్చి అధిక శబ్దం చేస్తూ వాహనాన్ని నడుపుతుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి


కలాం.. సలాం ఆకృతిలో విద్యార్థులు


నర్వ ఉన్నత పాఠశాలలో..

నారాయణపేట రూరల్: భారత క్షిపణి పితామహుడు, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ప్రపంచ విద్యార్థి దినోత్సవ వేడుకలు జాజాపూర్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలాం... సలాం అనే ఆకృతిలో నిల్చొని నివాళి అర్పించారు. అంతకుముందు కలాం చిత్రపటానికి ఉపాధ్యాయ బృందం పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయ, మధుసూదన్, లక్ష్మణ్, నరసింహ, నిర్మల, శిరీష, మాణిక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఘన నివాళి

నర్వ/ఊట్కూరు/ మక్తల్: అబ్దుల్ కలాం నేటి యువతకు ఆదర్శమని వక్తలు అన్నారు. బుధవారం నర్వ, ఊట్కూరు, మక్తల్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మాజీ రాష్ట్రపతి డా. ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి ఆయన జీవితంలోని స్ఫూర్తి దాయక కథనాలను విద్యార్థులకు వివరించారు.


పెద్దపొర్ల పాఠశాలలో..